క్లుప్తంగా

అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొడిమ్యాల: ప్రజాప్రస్థాన పాదయాత్రలో భాగంగా వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిలపై మహబూబాబాద్ ఎమ్మెల్యే అక్రమంగా పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని వైఎస్సార్‌టీపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ మండలం శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ స్వర్ణకు వినతిపత్రం సమర్పించారు. చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్ వర్మ, జిల్లా మహిళా అధ్యక్షురాలు గాదె స్రవంతి, పార్టీ నాయకులు న్యాయవాది మేక అంజయ్య, నాయకులు జుంతుల రాజిరెడ్డి, నంబరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యాదవుల ఐక్యతే లక్ష్యం


మాట్లాడుతున్న గనవేని మల్లేశ్

మల్లాపూర్: యాదవులను చైతన్యపరిచి వారి ఐక్యతే లక్ష్యంగా అఖిల భారత యాదవ మహాసభ పనిచేస్తుందని ఏబివైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గనవేని మల్లేశ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని వేంపల్లి యాదవ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవులంతా ఏకమై రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించి రాజ్యాధికారం పొందడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. జనాభా ప్రాతిపదికన నామినేటెడ్ పదవుల్లో యాదవులకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని కోరారు. యాదవ సంఘం మండల నాయకులు బజారు మదన్‌యాదవ్, జక్కుల రంజిత్ యాదవ్, వేల్పుల గంగాధర్‌యాదవ్, రవియాదవ్, బజారు శ్రీధర్‌యాదవ్ పాల్గొన్నారు.

సౌర విద్యుత్ యూనిట్లకు స్త్రీనిధి రుణాలు


అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోరుట్లరూరల్: మహిళలు ఇళ్లలో సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి స్త్రీనిధి రుణాలు అందజేస్తామని స్త్రీనిధి రిజినల్ మేనేజర్ ఆనందరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని కల్లూరు గ్రామంలో శుక్రవారం మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోలార్ యూనిట్లతో కలిగే లాభాలు, ప్రభుత్వం అందించే సబ్సిడీ గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వనతడుపుల అంజయ్య, ఐకేపీ ఏపీఎం శంకర్, సోలార్ అధికారి రాజేశ్, మేనేజర్ మహేశ్, ఉపసర్పంచ్ సంకె రాకేశ్, ఐకేపీ గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు సంధ్య, జ్యోతి పాల్గొన్నారు.

పశుసంపదను వృద్ధి చేసుకోవాలి


నివారణ మందు వేస్తున్న ప్రజాప్రతినిధులు

బుగ్గారం: పశుసంపదను వృద్ధి చేసుకోవడం ద్వారా రైతులు ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉంటుందని జెడ్పీటీసీ రాజేందర్ అన్నారు. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం యశ్వంతరావుపేట గ్రామంలో 854 జీవాలకు ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధే ధ్యేయంగా అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ కోల రాజు, నాయకులు తాండ్ర సత్యనారాయణరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సునీల్, సిబ్బంది మనోజ్‌కుమార్, గంగాధర్ పాల్గొన్నారు.

రెండో విడత స్వచ్ఛభారత్ మిషన్‌పై శిక్షణ

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో స్వచ్ఛభారత్ మిషన్ రెండో విడత అమలుపై మూడురోజుల పాటు జరిగే శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎంపీపీ మసర్తి రమేశ్, ఎంపీవో వెంకటకృష్ణరాజు, స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఐకేపీ వీవోఏలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వరిపైరుపై తెగుళ్ల పంజా

- వాతావరణంలో మార్పులే కారణం..
- దిగుబడి తగ్గే అవకాశం
- ఆందోళనలో అన్నదాత
- మండలంలో 25వేల ఎకరాల సాగు


సంధ్య, ఏవో


వరి పైరుపై పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

పెగడపల్లి: రబీలో సాగయిన వరి పైరుపై తెగులు సోకి రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో వరి పైరుపై అగ్గి తెగులు, పాము పొడ తెగులు సోకుతోందని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. దీంతో పైరు ఎదుగులపై ప్రభావం చూపుతుందని, ఫలితంగా దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందని అంటున్నారు. వ్యవసాయ అధికారుల సలహా, సూచనల మేరకు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

వాతావరణంలో మార్పులే కారణం..

మండలంలో రబీ సీజన్‌లో రైతులు అధిక శాతం విస్తీర్ణంలో వరిపంటనే సాగు చేశారు. ఇప్పటికే సాగు ఖర్చు, కరెంట్ సమస్యతో సతమతం అవుతుండగా, మరో పక్క వాతావరణంలో ఏర్పడుతున్న మార్పులతో వరిపైరుపై తెగుళ్ల సోకి ఆశలు ఆవిరవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్ని పురుగు మందులు పిచికారీ చేసినా తగ్గుముఖం పట్టడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని అనేక గ్రామాల్లో వరి పైరుపై అగ్గి తెగులు, పాము పొడ తెగులు సోకింది. జింక్ లోపం ఎర్పడి ఎర్ర బారుతున్నాయి.

25వేల ఎకరాల్లో వరిసాగు..

వ్యవసాయబావుల్లోని నీటి ఆధారంగా వరిసాగు చేశారు. ఈ రబీలో సుమారు 25వేల ఎకరాల వరకు వరిపంట సాగైనట్లు వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు. వరిపంట కొద్దిరోజుల నుంచి తెగుళ్ల ఆశిస్తున్నాయి. వ్యవసాయాధికారులు వరిపైరులను క్షేత్రస్థాయిలో సందర్శించి సస్య రక్షణకు తీసుకునే చర్యలు, సలహాలు సూచనలు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

తెగులు సోకడానికి గల కారణం..

రాత్రిపూట ఉష్ణోగ్రత 18 నుంచి 22 ఉష్ణోగ్రలు ఉండి గాలిలో తేమ 90శాతం ఉన్నప్పుడు, చిన్న చిన్న వర్షపు జల్లులు కురిసినట్లయితే వరి పైరుపై అగ్గి తెగులు సోకుతుందని ఏవో సంధ్య వివరించారు. వాతావరణం ఇలా ఉన్నప్పుడు యూరియా ఎక్కువ వేయొద్దని, ఎక్కువగా వేసినట్లయితే తెగులు మరింత ఉధృతం అవుతుందన్నారు. ఈ తెగులు సోకిన ఆకులపై ముదురు గోధుమ రంగు మచ్చలు, నూలు కండె ఆకారంతో మచ్చలు ఏర్పడుతాయన్నారు.

అగ్గి తెగులు నివారణకు..

తెగుళ్ల నివారణకు ట్రై సైక్లోజోన్ 0.6 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి ఆకులపై పిచికారీ చేయాలి. పొడ తెగులు.. కాండంపై నుంచి ఆకులపై సోకుతోంది. పాము పొడలాగా కనపడుతుంది. మబ్బులతో కూడిన వర్షం పడినప్పుడు ఈ తెగులు ఎక్కువగా సోకుతోంది.

నివారణ..

హెక్సాకోనజోల్ 2.0 మి.లీ. లీటరు నీటికి, లేదా వాలిడోమైసిన్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే ఒడ్ల వెంట గడ్డిని ఎప్పటికప్పుడు తొలగించాలని ఏవో సూచిస్తున్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మకరంద్

రాయికల్: రాయికల్ మున్సిపాలిటీ పరిధిలో పన్నులు వందశాతం వసూలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మకరంద్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అధ్యక్షతన నిర్వహించిన వార్షిక బడ్జెట్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రూ.12.32 కోట్లతో బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. రాయికల్ పట్టణంలో రూ.15 లక్షలతో అన్ని వార్డుల్లో మౌలిక వసతులు, రూ.1.50 లక్షలతో ఓపెన్ జిమ్, రూ.లక్షతో వీధి విక్రేత మండలాలు, డంపింగ్‌యార్డు, ఆధునిక కబేళాల నిర్మాణానికి రూ.2 లక్షలు, సమీకృత వ్యవసాయ మార్కెట్ కోసం రూ.2 కోట్లు, పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి రూ.2.22 లక్షలు, శ్మశాన వాటిక నిర్మాణానికి రూ.2 లక్షలు, ఉద్యానవనం, ఆటస్థలాలకు రూ.1.50 లక్షలు, మురికి కాలువల నిర్మాణం కోసం రూ.14.61 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయికల్ మున్సిపాలిటీలో ఆస్తి పన్ను, టీఎస్‌బీపాస్ భవన నిర్మాణ అనుమతుల ద్వారా ఆదాయం పెంచుకోవచ్చన్నారు. దీనికి స్థానిక కౌన్సిలర్లు సహకరించాలని కోరారు. కమిషనర్ సంతోష్‌కుమార్, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు కన్నక మహేందర్, మారంపల్లి సాయికుమార్, తురగ శ్రీధర్‌రెడ్డి, వడ్లకొండ మహేశ్, అన్వరిబేగం, కల్లెడ సునీత, శ్రీరాముల సువర్ణ, మ్యాకల కాంతారావు, మ్యాకల అనురాధ, కో–ఆప్షన్ సభ్యులు పిప్పరి మహేందర్, పెండెల వనీత, మిరాజొద్దీన్, మేనేజర్ వెంకట్, పంచాయతీ రాజ్ ఏఈ ప్రసాద్, టీపీఎస్ రమ్య పాల్గొన్నారు.

కంటి వెలుగును ప్రారంభించిన గంగవ్వ


గంగవ్వతో ప్రజాప్రతినిధులు, అధికారులు

మల్యాల: లంబాడిపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని మై విలేజ్ షో ఫేం గంగవ్వ శుక్రవారం ప్రారంభించింది. కంటి సంబంధిత సమస్యతో బాధపడుతున్న వారు వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. అవసరమైన వారికి కళ్లద్దాలు ఇవ్వడంతోపాటు శస్త్రచికిత్స కోసం పేర్లు నమోదు చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దొంగ కరుణాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మిల్కూరి అంజయ్య, ఏఎన్ఎం భవాని, ఆశవర్కర్లు, వార్డు సభ్యులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

విద్యార్థినులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


మాట్లాడుతున్న దీపికారెడ్డి

జగిత్యాల: విద్యార్థినులు భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని టీలైఫ్ హైదరాబాద్ ప్రతినిధి దీపికారెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాలలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో టీలైఫ్ (తెలంగాణ లేడీ ఇండస్ట్రియలిస్ట్ ఫెడరేషన్ ఫర్ ఇంటర్నర్‌షిప్) ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్న ఆలోచనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టాయని, వాటి గురించి తెలుసుకోవాలన్నారు. విద్యార్థినులు మార్కెట్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆర్థిక స్వావలంబన కలిగిన మహిళలే కుటుంబాలకు ఆధారంగా నిలుస్తారన్నారు. యువ పారిశ్రామికవేత్తలుగా ఎదిగినప్పుడే కుటుంబం, సమాజం బాగుపడి, దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో టీలైఫ్ ప్రతినిధి శిరీష, వైస్ ప్రిన్సిపాల్ సుల్తానా, శ్రీనివాస్‌రెడ్డి, స్వరూపరాణి, జ్యోతిలక్ష్మి, ఆర్.శ్రీనివాస్, శంకరయ్య, మానస పాల్గొన్నారు.

భోళా శంకర విగ్రహ ప్రతిష్ఠ

మేడిపెల్లి: బీమారం మండలం ఈదుల లింగంపేట్ గ్రామంలో శుక్రవారం భోళా శంకర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ వంగ వెంకటేశం, జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, బాపురెడ్డి, సత్తిరెడ్డి, గంగారెడ్డి, అంకం సాగర్ పాల్గొన్నారు.

నాగాలయ వార్షికోత్సవం

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్ గ్రామ శివారులోగల రాజరాజేశ్వర నాగాలయం వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వార్డుసభ్యుడి రాజీనామా ఉపసంహరణ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామపంచాయతీ ఒకటో వార్డు సభ్యుడు మామిడిపెల్లి లింగారెడ్డి తన రాజీనామాను ఉపసంహరించుకుంటున్నట్లు ఎంపీవో గంగాధర్‌కు శుక్రవారం లేఖ అందించారు. తమకు గ్రామపంచాయతీ నిధుల వివరాలు తెలియడంలేదని, ప్రోటోకాల్ పాటించడంలేదని ఆరోపిస్తూ లింగారెడ్డి వార్డుసభ్యుడి పదవికి రాజీనామా చేస్తున్నట్లు మూడురోజుల క్రితం ఎంపీడీవోకు లేఖ అందించిన విషయం తెలిసిందే. తన రాజీనామాను ఉపసంహరించుకుంటున్నట్లు లింగారెడ్డి శుక్రవారం లేఖ అందించినట్లు ఎంపీవో గంగాధర్ చెప్పారు.

పొలస్తేశ్వరస్వామి ఆలయంలో చోరీ

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులోని పొలస్తేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఏవో కార్యాలయంలోని విలువైన వస్తువులను చిందరవందర చేశారు. మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారికి కట్న, కానుకలు సమర్పించారు. ఈ నేపథ్యంలో దొంగలు గర్భగుడిలోకి చొరబడేందుకు యత్నించారు. తలుపుల తాళాలు పగులగొట్టేందుకు విఫలయత్నం చేశారు. ఆ తర్వాత ఏవో రూమ్ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఏమీ లభించకపోవడంతో బీరువాలోని సామగ్రి చిందరవందర చేశారు. జాతరకు వచ్చిన డబ్బును గురువారమే అధికారులు బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. ఎస్సై అనిల్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆలయ ఈవో వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

సంక్షిప్త వార్తలు

✦ పోలీస్‌స్టేషన్ తనిఖీ

కథలాపూర్: కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌ను కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఇటీవల కోరుట్ల సీఐగా ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టాక మొదటిసారిగా కథలాపూర్‌కు రావడంతో అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. పోలీస్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్సై రాంచంద్రం ఉన్నారు.

✦ విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంపొందించాలి

కథలాపూర్: ప్రాథమిక పాఠశాల స్థాయి విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంపొందించాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని విద్యావనరుల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలతో తొలిమెట్టు కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలిమెట్టు కార్యక్రమం ప్రారంభమై 5 నెలలు గడిచిందని, ఇప్పటివరకు సాధించిన ప్రగతిపై చర్చించారు. పాఠశాలల వారీగా నివేదికలను పరిశీలించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు మార్గం రాజేంద్రప్రసాద్, ఆకుల లక్ష్మీనర్సయ్య, సిరిపురం వెంకటేశం పాల్గొన్నారు.

✦ నూతన నియామకం

పెగడపల్లి: యాదవ హక్కుల పోరాట సమితి ధర్మపురి నియోజకవర్గం ఇన్‌చార్జిగా గొల్లపల్లి మండలంలోని వెనుగుమట్ల గ్రామానికి చెందిన పూదరి సత్తయ్య నియామకమయ్యారు. ఈ మేరకు సత్తయ్యను నియమిస్తూ సంఘం జిల్లా అధ్యక్షుడు బల్కం మల్లేశ్ యాదవ్ శుక్రవారం నియామక పత్రం జారీ చేశారు.

✦ కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాలు

పెగడపల్లి: మండలంలోని బతికపల్లి, నర్సింహునిపేట గ్రామాల్లో రెండు రోజులుగా కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయి. శిబిరాలను శుక్రవారం ఆయా గ్రామాల సర్పంచులు శోభారాణి, బాబుస్వామి సందర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ప్రజలను వారు కోరారు. మండల వైద్యాధికారి నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మల్లాపూర్: మండల కేంద్రంలోని శ్రీకనక సోమేశ్వర స్వామి ఆలయ హుండీ, టికెట్ల ఆదాయాన్ని ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం మాట్లాడుతూ మహాశివరాత్రి, శ్రీకనక సోమేశ్వర స్వామి జాతర ఉత్సవాల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారని, హుండీలో కట్నకానుకలు సమర్పించారన్నారు. ఆలయ కమిటీ, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆదాయాన్ని లెక్కించగా హుండీ, టికెట్లు, ఉత్సవాల్లో మైక్ అనౌన్స్‌మెంట్, విరాళాలు, కొబ్బరికాయల టెండర్ల ద్వారా మొత్తం రూ.6,73,610 ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

ఘనంగా లక్ష్మీనృసింహస్వామి రథోత్సవం


రథం లాగుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: మండలంలోని భూపతిపూర్ గ్రామంలో నృసింహస్వామి రథోత్సవం శుక్రవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రథంపై ప్రతిష్ఠించి గ్రామంలో పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. రథోత్సవంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ మహేశ్వర్‌రావు, ఉపసర్పంచ్ వేణు, సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు ముత్యంరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి నిరంతర కృషి


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

రాయికల్: గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మీరు నేను కార్యక్రమంలో భాగంగా రాయికల్ మండలం సింగరావుపేట గ్రామంలో పలు వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రూ.14లక్షలతో మున్నూరుకాపు, రెడ్డి, రజక, కుల సంఘ భవనాలను ప్రారంభించారు. శ్రీరాంనగర్, కిష్టంపేట గ్రామాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచులు రాంచందర్‌రావు, రాజమౌళి, జాన స్వరూప, ఎంపీటీసీ సాగరిక పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలి


మాట్లాడుతున్న వేణు

మెట్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలని బీజేపీ ఇన్‌చార్జి శీలం వేణు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 9, 14వ వార్డులో శుక్రవారం స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నియోజకవర్గంలో బీజేపీ బలంగా ఉందని, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమాల్లో పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దొనికెల నవీన్‌తో పాటు బొడ్ల నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్గితెగులు నివారణపై అవగాహన


సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి జ్యోతి

రాయికల్: అగ్గితెగులు నివారణపై మండలంలోని చెర్లకొండాపూర్ గ్రామంలోని రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. అగ్గితెగులు నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ వివరించారు. సర్పంచ్ ఆకుల రాజ్యలక్ష్మి, ఏఈవో మతాయి, రైతులు సురేశ్, రాజేందర్, ఎల్లయ్య, శంకర్ పాల్గొన్నారు.

పిలకదశలోనే అగ్గితెగులు నివారించాలి

కొడిమ్యాల: ప్రస్తుత వాతావరణ పరిస్థితిలో వరిపంటకు అగ్గితెగులు ఆశించే అవకాశం ఉందని, రైతులు పిలక దశలోనే అగ్గితెగులును నివారించకపోతే తర్వాత దశలో మెడవిరుపు వచ్చి దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి జ్యోతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పూడూర్ గ్రామంలో పలువురు రైతుల వరిపంట పొలాలను వ్యవసాయాధికారులు సందర్శించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కుంభం శ్రీనివాస్, గ్రామ రైతులు రాంరెడ్డి, ఐలయ్య, రాజేశం, శ్రీధర్, ఏఈఓ శ్రీలత పాల్గొన్నారు.

ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదానం


రక్తదానం చేస్తున్న సభ్యులు

జగిత్యాలటౌన్: ప్రింటర్స్ డే సందర్భంగా శుక్రవారం జగిత్యాల ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. భారతి బ్లడ్‌బ్యాంకులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ ప్రతినిధులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డా.రాచకొండ శ్రీనివాస్, ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముసిపట్ల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు తెలుగేటి కిరణ్, ప్రధాన కార్యదర్శి బొలుసాని మల్లికార్జున్, కోశాధికారి బానుక మహేశ్, ఉపాధ్యక్షుడు ఎర్ర శివరత్నాకర్, సభ్యులు బండారి సంతోష్, ఎర్ర రమేశ్, పిండం జలపతి పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి


వినతిపత్రం ఇస్తున్న ముస్లింలు

కోరుట్ల: మెదక్ జిల్లాలో కొద్దిరోజుల క్రితం పోలీసు దెబ్బలకు ఖదీర్‌ఖాన్ మృతి చెందిన విషయం తెలిసిందే. అతడి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం జరిపించాలని పట్టణానికి చెందిన పలువురు ముస్లింలు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఖదీర్‌ఖాన్ మృతికి కారణమైన పోలీసులు, సాక్ష్యాలు తారుమారు చేసిన డాక్టర్లపై ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. బాధితుడి కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ముజీబ్, వాజీమ్, ఇలియాస్‌ఖాన్, జయినొద్దీన్ పాల్గొన్నారు.

జీవామృతంపై రైతులకు శిక్షణ


అవగాహన కల్పిస్తున్న రైతు మిట్టపల్లి రామన్న

సారంగాపూర్: జీవామృతంతో పాటు, అగ్నిహోత్రం ద్వారా కీటకాల నివారణ తదితర అంశాలపై బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి రామన్న రాయికల్ మండలం ఆలూరు గ్రామ రైతులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఆలూరుకు చెందిన 30 మంది రైతు దంపతులు ఇక నుంచి సేంద్రియ పద్ధతిలో, జీవామృతంతో పంట సాగు చేయడం వంటి అంశాలు తెలుసుకోవడానికి ఈ విధానాల్లో 20ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్న రామన్న రైతు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రామన్న వారికి శిక్షణ ఇచ్చారు.

కుక్క దాడిలో దంపతులకు గాయాలు

జగిత్యాలక్రైం: కుక్క దాడి చేసిన ఘటనలో దంపతులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని లింగంపేట రోడ్డులో నివాసం ఉండే ఓ ఉపాధ్యాయుడు శుక్రవారం ఉదయం తన భార్యతో కలిసి పని నిమిత్తం బైక్‌పై బయటకు వెళ్తున్నాడు. బీట్‌బజార్‌లో ఆకస్మాత్తుగా ఓ కుక్క దాడి చేయడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. అనంతరం వారు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి, చికిత్స పొందారు.

కాంగ్రెస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా సాదిక్


నియామక పత్రం అందిస్తున్న కృష్ణారావు

కోరుట్లరూరల్: కాంగ్రెస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా పైడిమడుగు గ్రామానికి చెందిన షేక్ సాదిక్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ నేత జువ్వాడి కృష్ణారావు శుక్రవారం సాదిక్‌కు నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కొంతం రాజం, తిరుమల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.